# అవిదితమైన దేవునికొరకన్వేషణ

నేను 27 సంవత్సరముల క్రితము భారతదేశములో నొక సదాచార బ్రాహ్మణ కుటుంబములో జన్మించితిని. నా తలిదండ్రులూ, తాతలూ, అవ్వలూ అత్యున్నత నైతిక విలువలు పాటించెడివారు గనుక నా బాల్యమున నన్నటులనే పెంచిరి. నేను నా పితామహులకు ప్రథమ మనుమడిని గనుక వారితో కలసి యనేక హిందూ పుణ్య క్షేత్రములకు వెళ్ళుటయు నాచారకర్మ కాండలలో పాల్గొనుట యను ప్రత్యేకావకాశములు నాకు కలిగెను. నా తాత, అవ్వ చాల నిష్ఠాగరిష్ఠులు. గృహమందలి పూజామందిరములో వారు దేవుండ్లకు పూజలొనర్చుచూ, ఉప వాసము చేయుచూ, ప్రతిదినము శ్లోకములను వల్లించుచూ, ప్రతివారమూ గుడ లలో అర్చనలూ పూజలూ చేయుచూ దైవారాధనలు చేసెడివారు.

నా తలిదండ్రులు కూడ భక్తిపరాయణలు. పూజాపునస్కారములు ప్రారంభించ కమునుపే యవేల చేయవలెనో విశదీకరించెడివారు. అందువలన నేనునూ పట్టుదలతో నా కర్మకాండలలో పాల్గొనెడి వాడను. కొన్ని సార్లు నాకర్థమవని వాటిననేవో మంచి కారణముల వలననే చేయుదురని సమర్థించుకొనెడివాడను.

హిందువులమైనమేము బహు దేవతారాధన చేసెడివారము. పరబ్రహ్మలో లీనమగుటయే హిందుత్వపు పరమావధి. దానిని సాధించుటకనేక మార్గములున్న వనియు అయిననవన్నియు రాజయోగము, భక్తియోగము, కర్మయోగము, జ్ఞాన యోగమునను నాల్గు ముఖ్యవర్గములలోనేదోయొక దానికి చెందుననియూ హిందు మతము బోధించుచున్నది. మనసునకు సంబంధించినవగు ధ్యానము, చింతాశీలత, శ్లోకములను గానము చేయుటయనునవి రాజయోగమునకు చెందును. విగ్రహములకో లేక భావములకో భక్తిగల్గియుండుటను నేర్పునది భక్తి యోగము. ఒక వ్యక్తి జీవితములో విధుల బోధించునది కర్మయోగము. జ్ఞాన యోగమూపేరే చెప్పుచున్నట్లు జ్ఞానాభ్యాసమును బోధించును.

ఈ పద్ధతులేవియు నొకదానికొకటి వ్యతిరేకింపవు. ఎవరేని యీ యనేక మార్గ ములలోనేదేని యొకదాని ద్వారా తన గమ్యముజేరవచ్చును. తానెంచుకున్న

మార్గమును బట్టియా వ్యక్తి మోక్షమునో, సమాధినో, బ్రహ్మనో, ముక్తినో, ఆత్మ సంభావమునో లేక యాత్మజ్ఞానమునో, మున్నగు వానిలోనేదోయొక దాని పొందును. అందుచేత హిందుూత్వములో ద్వైతాద్వైతములు రెండునూ కలవు. నా సోదరునికినీ నాకునూ మేము యవ్వనముననడుగిడగనే "ఉపనయనము" చేసిరి. ఈ యుపనయనానంతరము జీవితములోని రెండవ ముఖ్య భాగమగు బ్రహ్మచర్యములో నడుగిడితిమి. ప్రతి బ్రాహ్మణపురుషుడును వివాహపూర్వ మీయుపనయనము నొందవలసినదే. బ్రహ్మచర్యమను నీ జీవితభాగమును దైవ చింతనతో గడుపవలెనని శాస్త్రముల బోధ. ఈ మార్గములో సాయపడుటకు యాచారకాండలసాధన చేయుమని మాకు నేర్పిరి.

మేము శ్వాస సంబంధిత వ్యాయామ ప్రక్రియా సాధకముల జేయుచూ, రహస్య మంత్రోచ్చారణలనేక వందలసార్లు వల్లించుచు, ప్రతిదినోదయ సాయం సమయములలో సంధ్యావందనములను, సూర్యనమస్కారములొనర్చుచుంటిమి. యజ్ఞోపవీతము ధరించి, నుదుట బొట్టునిడిగొని, భోజన పూర్వమువనూ యనం తరమునూ చేయవలసిన కర్మకాండల నాచరించుచుంటిమి. ఈ యాచారకాండల నభ్యసించుటతో నా జీవన గమనమే మారిపోయినది. నేనాత్మసంభావన మార్గ మవలంభించుచుండుటచే నీ పద్ధతులు విసుగు పుట్టించునవియేనైననూ యాకర్షణీయములుగానుండెను. ఈ విధముగా నాల్గు సంవత్సరములు గడచెను. నెమ్మదిగా నాజీవితమీ పద్ధతులలో స్థిరపడెనుగాని నేనింకనూ బ్రహ్మజ్ఞానమునొం దలేదు. నేను హిందూదేశములోనుండుటచే నాకంటేయనేక వత్సరముల పూర్వమునుండియే యుపనయనాచారముల నవలంబించుచున్న నా తండ్రినీ, తాతలనూ, పెదతండ్రులూ. పినతండ్రులూ, మేనమామలూ మున్నగువారినీ, పూజారులనూ తదితర బ్రాహ్మలనూ పరిశీలించగా వారు నాకంటే యేవిధముగా జూచిననూ యాత్మసంభావనలో ముందుగా లేరని చూడనాకమితాశ్చర్యమైనది. ఈ విషయము నన్ను చాల నిరుత్సాహపరచినది. కాని ఈ నిరుత్సాహమువలన నేనీయాచారముల విడువక ద్విగుణీకృతోత్సాహముతో నిర్వర్తించి, బ్రహ్మ తప్పక యున్నాడను నమ్మికను బట్టి బ్రహ్మజ్ఞానమొంద యత్నించుచుంటిని. నేనవలం బించుచున్న పద్ధతులలోనేదోయొక తేడాయుండవచ్చునేమో, లేక నేను తగినంత నిశ్చలబుద్ధితో నాచరించుటలేదేమో ననుకొనుచుంటిని. బ్రహ్మజ్ఞాన మొందవలెనను

నా దృఢ సంకల్పము, పుణ్య క్షేత్రయాత్రలు జేయనన్ను నాయుపనయనా నంతరము రెండు సంవత్సరములకు ప్రోత్సహించెను.

నా సహజ వివేకముతో రాజీపడకుండనే, నేను నేర్చుకున్న పద్ధతులననేక సంవత్స రములు సాధన చేసితిని. తదనంతరము నన్నునేను పరీక్షించుకొనగా యగాధ శూన్యతయే గోచరమాయెను. నా వివేకవిశిష్టమయిన మేధస్సుతోనాలోచింపగా జీవితమును ముగించుటయే యోగ్యమైన చర్యగానగుపడెను. ఒక రాత్రి మరణము గురించిన భయంకరమగు కల నా మనసును మార్చివేసి జీవించవలెనను కోర్కెను రేకెత్తించెను. నేను జీవించవలెనన్నచో నా జీవితమునకొక పరమావధియుండవలెను గనుకనదేమిటో తెలిసికొనగోరితిని. నేను సంపూర్ణమైనయాత్మ సంభావననొంది నపుడా జీవిత పరమావధి తెలియుననుకొంటిని.

నా జీవితముపై నాకు సర్వ హక్కులూనున్నవి గనుక, నా జీవితమంతటిని వినియోగించి నా జీవిత పరమావధిని కనుగొనవలెననుకొంటిని. ఈ మారు నా యత్నములు సహజ వివేకమున కనుగుణమైనవిగాను మనఃపూర్వకమైనవిగనూ యుండవలెనని తీర్మానించుకొంటిని. ఇంకేవేని ఇతర మార్గములున్న వానినికూడ సాధకముచేయ సిద్ధమైతిని. ఈ నా ప్రయత్నములనింక నేకాగ్రతతోజేయ నిర్ణ యించు కొంటిని. నేనేదైనపొందవలెనన్న దానికొరకు సాధన చేయవలెను; నేకోరు కొన్నది బహు విలువైనదయినచో మరింత యధిక సాధన కావలెనుగదా!

నా కుటుంబమునకూ, స్నేహితులకూ దూరమవకుండనే నేనీయన్వేషణలో నుంటిని. నాకిష్టమైనపుడితరులకు సాయపడుతుండెడివాడను. చాలమారులు నా శాయశక్తులా తోడ్పడెడివాడను. నా బాల్యకాలపు చేష్టలకాటంకము కానంతవరకు నా తలిదండ్రులనూ యితర పెద్దలనూ గౌరవించుచుంటిని. నా దృష్టికి నేను చెడ్డ వాడనుగా నగుపడలేదు. కొన్ని చెడ్డ పనులు చేసిననూ, వాటికంటె నేను చేసిన మంచి పనులే యధికమగుటవలన, చెడ్డ పనులు చెల్లుపెట్టబడుననుకొంటిని. ఇందు వలన నేను మంచి వాడనేయని నమ్మితిని. చాలమంది నేనుత్తముడనేయనుట నాకెంతో విలువైనదిగానుండెను. నాలోనున్న శూన్యత కలిగించుచున్న బాధలనుప శమింపజేసికొనుటకుగాను అందరూ నన్ను మెచ్చుకోవలెనని కోరితిని. పరోప

కారములజేయుటచే నేనౌదార్య బుద్ధిగలవాడననుకొన్ననూ, యీ తలంపు యేవిధముననూ నా లోని శూన్యతను తొలగింపలేకపోయెను. ఇదీలాగున్ననూ నా జీవితపరమావధియేమని తెలిసికొనుటకు ప్రతిదినమూ కొన్ని గంటల చొప్పున యనేక సంవత్సరములు ప్రయాసపడితిని.

మాదొక సమిష్టి కుటుంబము. నా తాత, అవ్వలూ, పెదనాన్నలూ. చిన్నాన్నలూ కలసి కుటుంబ వ్యవహారములనాలోచించి నిర్ణయములు చేయుచుండిరి. అటువంటి వ్యవహారములలో నా చదువు సంగతి చాల ముఖ్యమైనది. నేను మద్రాసులో హైస్కూలు చదువు కొరకు సిద్ధపడుటకు మా పెదనాన్న నన్నొక యలౌకిక తత్త్వ వాద తరగతిలోజేర్చెను. కొన్నివారముల పిదప యనుభవించుటకు మంచి వాటి వలె నగుపడు కొన్ని మార్పులు నాలో కల్గెను: రోజుకు రెండు మూడు గంటలే నిద్రించిననూ రోజంతయు చలాకీగానేయుండగల్గితిని; నాడీవ్యవస్థ 50కి తగ్గినది; ఇదివరకటికంటెనెక్కువ సమయము చదువుకొనగల్గితిని. ఈ మార్పులు నాకు ప్రియముమైనవేయయినను నేలోని శూన్యతలోనే మార్పును కలిగించలేకపోయెను. కొంతకాలమాగినచో నాశూన్యత దానంతటదే తొలగి పోవుననియాశించితిని. కాని యా యలౌకిక వాద ధ్యానములతో కొందరు మతిస్థిమితమును కోల్పోయిరని వింటిని. వెనువెంటనే యాధ్యానములను మానివేయవలెననుకొంటిని. ఆత్మసంభావనకితర మార్గములూనున్నవి. అందువలన నా ప్రశ్నలకుత్తరములనిచ్చునట్లగుపడిన " సరళ కుండాలినీ యోగ విధానము"నకు మారితిని. కరాటే మొదలగు విద్యల నేర్పు గురువులు సినిమాలలో ప్రశాంతులుగ కన్పడుచుండుటనుబట్టి ఆ విద్యల నేనునూయభ్యసించితిని. ఆ గురువులు జీవిత పరమావధినెరిగితిరనుకొంటిని. సరళ కుండాలినీ యోగాభ్యాసమునూ, కరాటే మొదలగు విద్యలనూ యేకాగ్రతతో నభ్యసించి, కరాటే విద్యలో "నల్ల పట్టా" అను స్థాయికెదిగితిని. సరళ కుండాలినీ యోగ విద్య శిక్షకునిగా తర్ఫీదునొందితిని.

నా దినముదయము మూడుగంటలకారంభించి నాల్గయిదు గంటలు యోగాభ్యాసములోనూ కసరత్తు చేయుటలోను గడిపిన పిదప కరాటేక్లాసులకు వెళ్ళుచుండెడివాడను. నాల్గు సంవత్సరములు, వారమునకైదారు దినములీ క్రమమునే పాటించితిని. కాని విచారమేమనగా నాయంతరంగమందలి శూన్యతను నింపుకొననేపాటియు

సమీపించలేదని చాల యాశ్చర్యపోతిని. కాని నేను సరైన మార్గములోనేయున్నానని నమ్మి యా పద్ధతులనేయభ్యసించుచుంటిని. నేను నేర్చుకున్న యభ్యాసములేపాటియు చెడుగు చేయవని నిర్ధారించుకొన్నయనంతరమే నా తలిదండ్రులకు వాటిని నేర్పెడివాడను. నేను పరబ్రహ్మను చేరగల్గినచో నా తలిదండ్రులనూ చేరవలెనన్నది నా యాశ. నా యంతరంగముననున్న శూన్యతను గురించిగాని, నా యన్వేషణల గురించిగాని నా కుటుంబములోనివారెవరికినీ ఎప్పుడునూ చెప్పలేదు. వారు నా యోగాభ్యాసములనూ, ధ్యానముద్రలనూ, కరాటే మొదలగు యభ్యాసములనూ చూచియవన్నియు యవ్వనప్రాయములో సహజ మార్పులేననుకొనుచుండిరి. వారికి నా యంతరంగమందలి యన్వేషణ గురించి చెప్పియుండినయెడల బాగుండెడిదని యిప్పుడనుకొనుచున్నాడు.

నేను హిందూమత పద్ధతులలో వేరుపారి యుండుటచే క్రైస్తవ్యములో నా ప్రశ్నలకు సమాధానములు కన్గొన యత్నించుటయనూహ్యము. క్రైస్తవులు వేషధారులనియూ, తాము చేయదలచుకొనిన వాటిని చేయుటకు వారి విశ్వాస పద్ధతులను పరిస్థితులకనుగుణముగా మార్చుకొందురనియు నేను నమ్మితిని. హిందూదేశములోని క్రైస్తవులు మనస్సాక్షిలేనివారనియు, బ్రిటిషువారీదేశమును పాలించుట వలననే మతమును మార్చుకొన్నారనియు నా స్నేహితులలోననేకమంది యభిప్రాయము. అంతియగాక, బ్రిటిషువారీదేశమును పాలించిన 200 సంవత్సరములలో క్రైస్తవ విశ్వాసమునుగూర్చి యొక్క మంచి మాటనైన వినలేదు.

షికాగో నగరములోని నార్తర్న్ ఇల్లినాయ్ విశ్వవిద్యాలయములో కంప్యూటర్ సైన్సులో మాస్టర్స్ డిగ్రీ చదువు కొరకు 1991 సంవత్సరమునచేరినప్పటికి నా వయస్సు 21 సంవత్సరములు. నాయంతరంగమందలి శూన్యత నాలోనేయుండెను. ఈ సరికి నేను పుణ్య క్షేత్రములను దర్శించుట యసంపూర్తిగనేయుండుటచేత మరి కొన్ని సంవత్సరములు నా యాధ్యాత్మికాన్వేషణ కొనసాగించిననూ నిష్ఫలమే యగునేమోయనుకొంటిని. వేదాధ్యయనముతో నా ప్రశ్నలకుత్తరములు దొరకునని నిశ్చయించుకొంటిని. మా కుటుంబము ఋగ్వేదమందలి విధుల పాటించునని నా తల్లిగారు చెప్పుట నాకు జ్ఞప్తికి వచ్చుటచే నా వేదమునకర్థము చెప్పు పుస్తకముల కొరకు వెదకి వాటినొక గ్రంధాలయములో కనుగొంటిని. వేదములను సులభశైలిలో

విశదీకరించునని పేరొందినయొక పుస్తకము నన్నెంతో యాకర్షించినది. ఆ రచయిత హిందూ మత మూలాధారములైన సిద్ధాంతములను బహుజాగ్రత్తగా విశదీకరించెను. కాని నాలోని లోతైన ప్రశ్నలకు జవాబులనీయలేదు.

అందుచేత విజ్ఞానమువైపు తిరిగితిని. " క్వాంటమ్ థీయరీ"యను నంశముపై హిందూ దేశస్థుడైన యొక విజ్ఞానవేత్తచే రచింపబడి బహు జనాదరణొందిన యొక పుస్తకమును చదివితిని. హిందూత్వము విశ్వమును గూర్చి నిర్దేశించిన విషయముల నారచయిత విపులపరచెను. అనేక భావనల విశదీకరించుటకారచయిత సర్వోత్కృష్ఠ మైన ధ్యాన ముద్రలలో తనయనుభవములగూర్చి చెప్పెను. నేనీ పద్ధతులనాచ రించుకాలములో నొకవేళ కొన్ని బోధనలను సరిగా పాటించుటలో తప్పితినను కొంటిని. అయిననూ ఆ పద్ధతుల నవలంబించ మరలు కొల్పలేదు. క్యాన్సరు వ్యాధి గ్రస్తుల మనసులలోని  యపరాధములగూర్చిన యాలోచనలను రూపుమాపుటచేనట్టి వ్యాధిగ్రస్తుల మనసులలోని యపరాధముల గూర్చిన యాలోచనలను రూపు మాపుటచే నట్టి వ్యాధిగ్రస్తులు " ఖిమో థెరపీ" యను వైద్యవిధానమునకు సరిగా స్పందింపనేర్పుట సాధ్యపడెనని యారచయిత వ్రాసెను. మేధస్సునకూ శరీరము నకూ అవిచ్ఛిన్న మైన సంబంధమున్నదనియూ, శరీరమందలి ప్రతి జీవాణువులోనూ జిజ్ఞాసయున్నదనియూ నాయన నిరూపించెను. తాచెప్పిన మరెన్నో విషయములు సత్యములనియాయన వాదన.

ఆయన రచనలవలన నేను నేర్చుకొన్న ఏకైక విషయమేదనగానొక వ్యక్తి మృతినొందక పూర్వమే వాని పాపము వానినేదోయొక రోజు, యేదోయొకవిధమున పట్టుకొనునని.  ఇది కర్మ సిద్ధాంతమే గదా! నా జీవితములో కొన్నయిననూ చెడు పనులు చేసితినని యెరుగుదును. " ఇవి తప్పులూ నివిఒప్పులూనని నిశ్చయముగా నిర్ధారింపబడలేదేమో? పరిస్థితుల ప్రభావముననో, చిన్నతనము వలనగాని స్నేహితుల బలవంతము వలనగాని, లేక మరేవో కారణములచేత గాని నేను చేసిన తప్పులను హేతుమాత్రముచే నాకారణములనే నిందింపవచ్చున"ని నన్ను నేను సముదాయించుకొనుచుంటిని. ఇదొక గొప్పయాలోచనగానే యగుపడి నదిగాని యాచరణలో పనికిరాలేదు. ఎక్కడోనొకచోట నిశ్చయ నిర్ధారణలుండి యుండవలెననిపించినది. కాని యా రోజులలో పాపమును గూర్చిన యాలోచనలు

నాకు ఆత్మ సంభావనకన్న ముఖ్యమైనవిగానగుపడలేదు.

హిందూదేశమునుండి వచ్చిన సోఫియా యను క్రైస్తవురాలిని నేను 1991లో కలిసికొంటిని. మా విశ్వవిద్యాలయములోని కంప్యూటరు లేబరేటరిలో మేమిరువురము పనిచేయుచుండుటచే నచిరకాలములోనే మంచి స్నేహితులమైతిమి. మా యాదృచ్ఛిక సంభాషణలలో, కొన్నిసార్లు, మా యిద్దరి మధ్యనున్న మతపరమైన తేడాలగురించి చర్చించుట తటస్థించెను. " నీ జీవిత పరమావధియేమి?"యనునది నా ప్రియమైన ప్రశ్నగనుక నేనామెనొకసారి యాప్రశ్నవేసితిని. " దేవుని మహిమ పరచుట" యనియామె తడుముకొనకుండ జవాబిచ్చి నన్నాశ్చర్యపరచినది. ఆమె ధోరణి చూడనదేదొనొక బహు తేలికైన ప్రశ్నయనిపించెను. అందువలన నాయహం దెబ్బతినుటచే నేనామె జవాబును లక్ష్యపెట్టక, ఆమెను మరిన్ని ప్రశ్న లడిగి నాయాశ్చర్యమును కనిపెట్ట యత్నించితిని.

ఆ రోజు నాయంతరంగమున నేను బహుగా కదలింపబడితిని. సోఫియా సమాధానము యుక్తముగానే యగుపడెను. నిజముగానే దేవుడొకవేళ నా వెలుపల నున్నాడేమో, నేనేల జీవించుచున్నానోయనునదీ, నాలోనున్న శూన్యమును కూడ నాయన యెరుగునేమోయని నాకనిపించెను. కాని నేనాత్మ సంభావనాన్వేషణలో నేకాగ్రుడనౌటచే, నానుండి పత్యేకమైన దేవుడున్నాడన్నయాలోచన నా కంతు పట్ట లేదు. నేనేల జీవించుచున్నానోయన్న ప్రశ్నకు సమాధాన మీదేవుని మహిమ పరచుటయేనేమో! " ఇంత తేలికరైన విషయమునునేనేల కనుగొనలేకపోతిన"ని యాలోచించితిని." నీ జీవిత పరమావధియేమి?" యను నా ప్రియమైన ప్రశ్నకు కొందరు " పరోపకారమని"యూ, యింకొందరు " నాకుటుంబమునకు సేవ చేయుటకని"యు, మరి కొందరు " ధనార్జనచేసి యా ధనము పేదలకిచ్చుట కొరకని"యు నీ విధమైన దివ్య సమాధానములనిచ్చిరి. నేను మంచివాడనని యితరులనినప్పుడు నాలోనేను సంతోషించుటకే నేను ధర్మకార్యముల జేయు చున్నానని నాయంతరంగమందు నేనెరుగుదును. అందుచేతనేచేసిన పరిత్యాగ క్రియలన్నియూ స్వప్రయోజనమునకే చేసితిని.

అనేక లక్షల దేవుండ్లనారాధించుచూ, ననేక తత్వబోధలజేయుచూ, ననేక

యాచారకాండలనేర్పుచూ, యనాదిగా వస్తున్న హిందూ మతము విశదపరచలేని విషయములను, ఒకే దేవుడని చెప్పుచున్న సర్వసాధారణ మతమగు క్రైస్తవ్యమే లాగు వివరించుచున్నదీయని నాలో ప్రశ్నలూ ఆలోచనలూ కోకొల్లలుగా పుట్టు కొచ్చెను. ఒకవేళ సమాధానములు హిందూ మతములోనేయున్నచో నేచేసిన యనేకనేక యత్నముల యనంతరమా సమాధానముల నేనేల కన్గొనలేకపోతినీ? మరి కోట్లాది యితర హిందువుల మాటేమిటి?

నా ప్రశ్నకు సోఫియా యిచ్చిన సమాధాన మద్వితీయమైనదేమీ కాదు. ఏలనన, భారతావనిలోనున్న హిందూదేవాలయములలోని పూజారులనూ దేవుని మహిమ పరచుటే వారి జీవిత పరమావధియని సమాధాన మిచ్చియుందురు. కాని, వారి దేవుండ్లు విగ్రహములగుటచే వారి సమాధానములోని భావనే వేరు. ఆ పూజారులు వారి దేవుండ్లను శుభ్రపరచి, యలంకరించి, చివరికాదేవుండ్లను నిదురింప జేసెదరుకూడ.

నేనునూ బాలుడనుగానుండగా విగ్రహములను కడిగితిని, కీర్తనలు పాడితిని, అనేక ప్రార్థనలనూ వల్లించితిని. భౌతిక పదార్థములతో నిర్మితమైన వాటికి నేను జీవము నాపాదించి, మహిమ పరచితిని. నా దృష్టికవి విగ్రహములేగాని నా మనసు వాటి కేమేమి చేయవలెనో నిర్ణయించెను. నిజముగా దేవుడున్నచో నా దేవుని మహిమ పరచుటయే నా జీవిత పరమావధియగునన్న యాలోచన నన్ను బహుగా కలవర పరచెను. ఆ కలవరమునుండి విముక్తి పొందవలెనన్న నేనా నిజమైన దేవుని తెలిసి కొనవలెనని నిశ్చయించుకొంటిని.

సోఫియా తన జీవితపరమావధి యేసుక్రీస్తును మహిమ పరచుటయేనని చెప్పిన విషయము నాకు క్షుణ్ణముగనేయర్థమైనది. యేసుక్రీస్తు హిందూదేశములోని వేలాది పావన పురుషులవంటివాడేయయినయొక మానవుడని చరిత్ర పుస్తకములలో చదివితిని. తామే దైవములనో లేక తమకు దేవునితోనతి సమీప బంధమున్నదనో లేక యాత్మ సంభావనకొరకు మార్గము చూపెదమనియో చెప్పెడు యనేకమంది గురువులు భారతావనిలోనున్నారు. కుండాలినీ యోగశిక్షకునిగా నాకును యోగ్యతా పత్రిక యున్నది. యేసుక్రీస్తుకూడనటువంటి గురువులలోనొకడనుకొంటిని. సోఫియా

సమాధానముతో నిరుత్తరుడనయిన నాకు క్రైస్తవ మతములో నిజము లేదనీ, యేసు క్రీస్తు సత్ప్రవర్తనగల సామాన్య మానవుడేయైనను ప్రజలాయనకు దైవత్వమారో పించిరనియు ఋజువుచేయ కంకణము కట్టితిని. హిందూదేశములో మహానుభావు లయిన రాజుల నారాధించువారు కూడనున్నారు. యేసుక్రీస్తుకూడనట్టి జాబితాలోని వాడేననుకొంటిని. ఒకవేళ క్రైస్తవులకడనున్న బైబిలు గ్రంథమున్నత తర్జుమా వలన క్రైస్తవులు వారి మత ప్రభోధములను విశదముగా తెలిసికొనగల్గుచున్నారను కొంటిని. కాని వారిదగ్గరనున్న బైబిలు వంటిదే నాదగ్గరనున్నదీను గనుక క్రైస్తవ మతాచారములను జాగ్రత్తగా పరీక్షించి క్రీస్తుకూడ హిందూ దేశములోని వంచక గురువుల కోవకు చెందిన వాడేనని నిరూపించబూనుకొంటిని.

నేను కొన్ని చర్చిలకువెళ్లి యక్కడి పాస్టర్లను తత్వజ్ఞాన సంబంధమైన యుక్తిగల ప్రశ్నలడిగి వారిని నిరుత్తరులనుజేయ ప్రయత్నించితిని. నా ప్రశ్నలకు వెన్వెంటనే వారు జవాబులనీయలేకపోయినచో వారికింకొక యవకాశమైననీయకుంటిని. అంతియగాక తెలిసికొనుట నావిధియనియైనను నేననుకొనలేదు. "బౌద్ధమతము మానవుని కోర్కెలే చెడుగుకు కారణమని బోధించుచున్నదిగదా. మరి యా బోధ ననుసరించినచో పదియాజ్ఞల యవసరమేమి?" యన్నది నేనడిగిన ప్రశ్నలకొక మచ్చుతునక. క్రైస్తవ్యముపై దుమ్మెత్తి పోయుటే నా యుద్దేశము. ఈలాగు చేయుచున్ననూ క్రైస్తవ్యములోని కొన్ని సత్యములను నేను తెలిసికొంటిని. అవేవనగా - క్రీస్తు సిలువమీద కౄరముగా చంపబడెను; మానవాళి పాప పరి హారార్థమే తను చనిపోతున్నానని క్రీస్తు చెప్పెను; ఆయన మూడవ దినమున సజీవుడుగా లేచెనని వ్రాయబడినది; ఆయన ప్రేమాస్వరూపీ దయార్ద్ర హృదయుడునునవి.

హిందూదేశమునుండి వచ్చి క్రైస్తవమతమునకునూ మిగత మతములకునున్న తారతమ్యముల వివరించుచున్న యొక పాస్టరుగారు పెట్టిన సభలకు సోఫియా నన్నాహ్వానించెను. అన్ని మతములలోనూ మానవుడు దేవుని వెదకుటకు శ్రమించును గాని క్రీస్తు మతములోని దేవుడే మనమున్న చోటికి వచ్చుననియూ పాస్టరుగారు చెప్పిరి. ఆహా! ఎంతయాశ్చర్యము! ఈ మాటలు నన్నాకట్టుకొనెను. ఇదే నిజమయినవెంతబాగుండును. పంద్రెండేండ్ల నా కడగండ్లయనంతరము సర్వాం

తర్యామియగు దేవుడు నాయెద్దనేయున్నాడని వింటిని. ఈ సంగతుల సాధ్యాసాధ్యముల గురించి నేనాలోచింపక పూర్వమే నా కుటుంబమూ, సంస్కృతీ, సాంప్రదాయములూ, వంశపారంపర్యమున సంపర్కమగునవన్నియు నాకండ్లముందొక మెరుపువలెనగుపడెను. ఈ క్రొత్త బోధ నేనెట్లు నమ్మగలను? క్రైస్తవ్యమును నేనసహ్యించుకొన్నట్లే నా తలిదండ్రులూ, హిందూదేశములో నేనెరిగిన యనేక మందియు నసహ్యించుకొనుచుండిరి. ఆ పాస్టరుగారు చెప్పినది సత్యమేననిపించి నదిగాని యవి నమ్మశక్యము గానివనుటకే నేను నిశ్చయించుకొంటిని. క్రైస్తవ్యములో నేనడుగుచున్న ప్రశ్నలకు సమాధానములుండునేమోనన్న భయముతో యుక్తిగా ప్రశ్నలడుగుట మానివేసితిని.

క్రైస్తవ్యము నా ప్రశ్నలకు జవాబులనివ్వగలదని కొన్నివారములు గడచిననూ మరువలేకుంటిని. పనికిరాని మతమని నా సంస్కృతి చెప్పిన చోట సమాధాన్వేషణ యనునది నాకు మిక్కిలి భయముగొల్పినది. "ఈ దేవుడేయున్నటయిన నా సమస్యలన్నింటినీ ఆయనే కరిగించివేయును. నాయన్వేషణ పర్యవసానముల నాయనే చక్కపరచును; ఈ నిజమైన దేవుని నేనెట్టకైన కనుగొనగల్గినచో నా సంస్కృతి సంబంధమైన వాటిని నేను పట్టించుకోనక్కరలేదని నాలో నేనను కొంటిని ". ఈలాగున నీ విషయమై క్షుణ్ణముగా పరీక్షించినప్పటికినీ నా జాగ్రత్తలో నేనుంటిని. బైబిలులో తప్పొట్టుటకైన నాయంతిమ ప్రయత్నముజేసితిని. ఒకాయన నాకొక నూతన నిబంధనను బహుకరించెను.(డబ్బు పెట్టి నేనెలాగూయెప్పటికీ కొనను.)

యోహాను సువార్త మొదటియధ్యాయము చదువగా యేసు దేవుని వాక్కనియూ, దేవుని భావప్రకాశమనియు తెలిసికొంటిని. రెండవ యధ్యాయములోనాయన చేసిన యద్భుతక్రియల చదివితిని. వీటిని బట్టియాయన మానవాతీతుడని యెరిగితిని. మూడవ యధ్యాయములో యేసు తిరిగి పుట్టుటను గూర్చి చెప్పెను. ఇది నిజముగా నెంతో యాశ్చర్యకరమైన సంగతి! పునర్జన్మయనన మరొకతరి భౌతికముగా పుట్టుట కాదనియు నదిమానసికమైనదనియూనాయూహ. యేసు చెప్పిన పునర్జన్మము చాల వివేకమైనది. ఇది సాధారణముగా మనము నూతన సంవత్సరమునకై చేసి కొనెడి యొక తీర్మానము వంటిదేగాని, యీ సందర్భముగా నిది నిజమైనదియూ,

యేసు యొక్క నూతన స్వభావమును సంతరించుకొన్నదియునని యర్థమైనది.

ఆత్మ సంభావనయత్నములను విడిచిపెట్టి క్రీస్తుకు నన్ను నేను వినయముగా నర్పించుకొన్ననేగాని క్రీస్తునెరుగలేనని యర్థమైనది. ఇదొక సబబైన గొప్ప వినిమయ మని నిర్ధారించుకొంటిని. "దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా యాయన తన యద్వతీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడునూ నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయననను గ్రహించెను"అని బైబిలు చెప్పుచున్నది. యేసు క్రీస్తు సమరయ స్త్రీతో, "నేనిచ్చు జలమును నీవు త్రాగినచో నవి నీలో జీవజలపుయూటలగును గనుక నీవు పదేపదే యీ నూతి దగ్గరకు రానక్కరలేద" ని బోధించుటను యోహాను సువార్త నాల్గవ యధ్యాయ ములో చదివితిని. ఇది నాకు సరిగా సరిపోయినది. నేను నాలోని శూన్యమును నింపు కొనుటకు శతవిధములగు నిష్ఫల యత్నములు చేయుచుండగా క్రీస్తు తానా శూన్యమును పొర్లిపారునంతగా నింపెదనన్నాడు. అనగా నేను క్రీస్తు సహాయ మర్థించినచో నాలోని శూన్యమును నింపుటకిక నేనేయితర పద్ధతులనూ వెదక నవుసరములేదు. ఇదే గదా నేనిన్నాళ్ళనుంచి వెదకుచున్న సమాధానము!

మొత్తమంతయు విపులముగానగుపించుచున్నది. నా సహజ నైజమే నన్నసంపూ ర్ణునిగాజేసినది. అనేక విధములుగా పెక్కు సంవత్సరములు నేనీ శూన్యతను నింపు కొనుటకు చేసిన ప్రయత్నములెవ్వియు ఫలింపలేదు. ఇలాంటి స్థితిలో నేను మరణించియుండినచో నిశ్చయముగా దేవునియొద్దనుండి యుండక పోదును. కాని దేవుడే తన ప్రేమవలన క్రీస్తునంపి, నాలోని శూన్యతను నింపి, నన్ను సంపూర్ణునిగా జేసినాడు. మరణమూ, దేవునినుండి యెడబాటులనునంతిమ శిక్షను క్రీస్తనుభ వించినాడు. నేచేయవలసిన ప్రాయశ్చిత్తమును యేసుక్రీస్తే తానొందిన శ్రమలు, మరణము, దేవునినుండి యెడబాటులనునవి యనుభవించి నా బదులు ప్రాయశ్చిత్తముజేసెను. కాని చనిపోయిన మూడవ దినమున తిరిగిలేచి మానవ భౌతిక జీవితపు ముగింపయిన మరణము ద్వారా ఆయన వెళ్లినాడు. తామనుభ వించవలసిన శిక్ష క్రీస్తు మరణము వలన పూర్తిగా చెల్లింపబడినదని విశ్వసించువారి కేమి జరుగునో దేవుడు క్రీస్తు పునరుత్థానము ద్వారా చూపినాడు.

ఇది పూర్ణజ్ఞానము. ఈ దివ్యమార్గమును నేనెంచుకొన్నచో, మరణమైనను నన్ను

నా దేవునికి దూరముగానుంచ జాలదు. ఈ విషయమెరుగకమునుపు, ఒక వ్యక్తి మరణసమయమున మాత్రమే తన విధియేమైనదీ తెలిసికొనగలడనుకొంటిని. కాని యాత్మ రక్షణ యడుగగనే లభ్యమగునని క్రీస్తు బోధించెను. ఈ రోజున, నేనింకను సజీవునిగ నుండగనే, నేనాత్మ రక్షణననుభవించగలను. మరియారక్షణ నొందుటకు నేనేమి చేయవలెను?

తనయందు విశ్వసించుట మాత్రముననే రక్షణ లభించునని క్రీస్తుబోధ. ప్రతి వ్యక్తియూ మరణ ద్వారముగుండ వెళ్ళుటకు సుగమమైన మార్గమేర్పర్చబడినది. దేవుడు సర్వాంతర్యామియగుటచే నాయన నాకతి సమీపముననుండి నాయాలోచన లన్నింటిని తెలిసికొనును. నే చేయవలసినదెల్ల విశ్వాసముతోనొక్క యడుగు ముందుకు వేయుటయే. నేను వేయవలసిన యామొదటియడుగెప్పుడు వేయుదు నోయని క్రీస్తు ఎదురు చూచుచున్నాడనిపించినది. "యేసూ, నిన్ను నీవు బయలు పరచుకొనిన విధముననే నేను నిన్ను విశ్వసించుచున్నాన"ని ప్రశాంతముగానున్న నా హృదయాంతరంగములో మనస్ఫూర్తిగా చెప్పితిని.

మార్చి 5, 1994 వేకువ ఘడియలలో నిది సంభవించెను. ఆ క్షణమున జరిగిన దాని వర్ణింప మాటలు చాలవు. నాలోనప్పటి వరకునున్న శూన్యత యెన్నడూలేనట్లే మటుమాయమైపోయినది. నేను ప్రక్షాళింపబడిన విధమును నా యంతఃకరణలో ననుభవించితిని. గొప్ప శాంతి సమాధానములు నాకు కల్గెను. గత 12 సంవత్స రములుగా నేగాలించుచున్నదిదియేనని నాకు వెంటనే యర్థమైనది. తన్నంగీకరించి నంతనే యాశ్చర్యకరమైన యనుభూతులు కల్గునని క్రీస్తు ఎన్నడూ వాగ్దానము చేయలేదు. అంత మాత్రమున క్రీస్తు వాగ్దానములు వట్టివని కాదు. విశ్వాసములో నీ మొదటి యడుగు వేయగనే నా స్నేహితులలో ననేక మందికెట్టి యనుభవములూ కలుగలేదు. కాని క్రీస్తు ఒక్కడే, మార్గమూనొకటే, విశ్వాస మునూ ఒక్కటే. ఇవి రక్షణయనునొకే ఫలితమిచ్చును.

బైబిలును, క్రీస్తునూ పరీక్షించిన తదుపరి, హిందూత్వములోని యనేక పద్ధతులలో పొందదగిన ఫలిత మీ క్రీస్తు బోధయేనని నాకు ధృఢమైన నమ్మకమమరినది. "అసతోమా సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ, మృత్యోర్మాయమృతంగమయ"

యను హిందూమత ప్రార్థనననుదినమనేక వత్సరములు పాఠశాలలో వల్లించితిమి. ఈ ప్రార్థనకు జవాబు క్రీస్తు జెప్పిన " నేనే మార్గమును, సత్యమును, జీవమును. నేనే జీవమును, పునరుత్థానము"నను వాక్యమందున్నది. క్రీస్తును నిష్కపటమైన హృదయములతో పరీక్షించుడని నా హైందవ సోదర సోదరీమణులను వినయముగా కోరుచున్నాను. హిందూ మతములోని పలుమూర్గములు దేవుని చేరుటకు వ్యక్తి గతమైన ప్రయత్నములను వివరించును. కాని మన భాగ్యము వలన మన స్వప్రయత్నములను దేవుడడుగుటలేదు. యేసు క్రీస్తునందు విశ్వసించుట మాత్రము ననే దేవుడాత్మ రక్షణ ననుగ్రహించును.

నేను క్రీస్తునంగీకరించి రెండేండ్లయినవి. సోఫియాయను నా భార్యద్వారా నా జీవితములోనికింకొక దీవెన చేరినది. నేను క్రీస్తునంగీకరించిన తర్వాతనొక సంవత్స నకు మేము పెండ్లి చేసికొంటిమి. క్రీస్తునెరుగవలసిన విధముగానెరుగని వారి గురించి బహు భారము క్రీస్తునెరిగిన మా యిరువురికిని కలదు. మనమాయనయందు విశ్వసించగనే క్రీస్తు పరిశుద్ధాత్మ ననుగ్రహించి మనలోని శూన్యతను నింపును. ఈ శూన్యతను నింపుటయను కోర్కెను పరిశుద్ధాత్మ మాత్రమే తీర్చగలడు.

తానొక్కడే సత్యమునకు మార్గమునని ప్రేమతో క్రీస్తు చెప్పెను. ఇటువంటి గంభీరమైన వివరణలతో క్రీస్తు తన యద్వితీయతను విశదీకరించెను. ఈ రోజులలో ననేకమంది తత్వవేత్తలూ, గురువులూ, క్రీస్తును త్రోసివేయలేక ఆయనను కూడ తమ మార్గములలోనొకనిగా చేర్చుకొన్నారు. క్రీస్తు చూపిన మార్గము సరియైనదికాదని నిరూపించిననేగాని ఎవరునూ వారి మార్గమే సరియైనదని చెప్పలేరు. క్రీస్తు తను చెప్పినట్టు మార్గము కాకపోయినచో ఆయన యబద్ధికుడవవలెను లేక మిగిలిన యితర మార్గములన్నియు నాశనమునకు నడుపునవేయవవలెను. మరొక యాలోచ నకు తావేలేదు. క్రీస్తు ఒక మంచి బోధకుడనీ, ఒక గొప్ప తత్వజ్ఞుడనీ, ఒక శాస్త్రజ్ఞు డనీ కొందరందురు. ఈ విధమైన యాలోచనలు దైవకుమారుని సామాన్య మానవు నిగానెంచి యవమానపరచుటయే. ఆయన తను దేవుని కుమారుడనని ప్రకటించుట చేతనే సిలువ వేయబడెను. మహానుభావులనబడువారు తామవలంబించు మార్గము లను మనకును చూపెదరు. కాని క్రీస్తు తనే మార్గమునని చెప్పి, మనము దేవుని బిడ్డలగుటకు పద్ధతియాయెను. ఆయనే శుభవార్తయాయెను. దేవుని దరికి చేరుటకు

మార్గమాయెను.

నా వంటి దౌర్భాగ్యుని రక్షించినందుకు నా యజమానియైన క్రీస్తుకు నా వందనములు.

ఆర్.ఎన్.
ఫోర్ట్ వర్త్.